# చైతన్య గళం
తెలుగు దిన పత్రిక









సంచిక :170 సంపుటి : 1 హైదరాబాద్ , రంగారెడ్డి, నాగర్ కర్నూల్ , మహబూబ్‌నగర్ బుధవారం 24-7 -2024 వెల : .రూ. 5.00




# 48.21 లక్షల కోట్లు

కొన్ని మెరుపులు..మరికొన్ని విరుపులు..

- కొన్ని ఆశలు..మరికొన్ని ఆకాంక్షలు
- 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్
- వ్యవసారంగానికి పెద్దపీట వేస్తూ నిర్ణయం
- నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై దృష్టి
- స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు
- మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లు
- పన్ను ఆదాయంఅంచనా రూ.28.83 లక్షల కోట్లు
- ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా
- అప్పలు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లు
- అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు కేటాయింపు
- పోలవరం పూర్తిచేసేందుకు వాగ్దానం
- బీహార్‌లో మౌళిక వసతుల కల్పనలకు భారీగా కేటాయింపులు
- బంగారం, ఫోన్స్ యాక్సరీస్‌పై సుంకాలు తగ్గింపు



23, జూలై (చైతన్యగళం)న్యూఢిల్లీ,

కొన్ని మెరుపులు..మరికొన్ని విరుపులు.. కొన్ని ఆశలు..మరికొన్ని ఆకాంక్షలతో ఎప్పటిలాగే ఉద్యోగుల ఇన్‌కమ్ ట్యాక్స్‌పై పెద్దగా సడలింపులు లేకుండా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశ పెట్టారు. కేంద్ర ప్రభుత్వం 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా ప్రాధాన్య అంశాలను ఎంపిక చేసుకుంది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన- నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన- ఆవిష్కరణలు, తయారీ-సేవలు, తర్వాత తరం సంస్కరణలు- ఈ తొమ్మిది అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. -మిగతా 2 లో




## నీట్ పరీక్ష పేపర్ లీక్ నిజమే

- కేవలం 155మంది మాత్రమే లబ్ధి పొందారు
- మళ్లీ పరీక్ష నిర్వహించడం కుదరదు
- దీనిపై సిబిఐ విచారణ సాగుతోంది
- సుప్రీం చీఫ్ జస్టిస్ వైవి చంద్రచూడ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, నీట్ ప్రశ్నపత్రం లీకైన మాట వాస్తవమేనని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. నీట్ అంశంపై విచారణ ముగియడంతో సీజేఐ ధర్మాసనం మంగళవారం తీర్పు -మిగతా 2 లో

## కెసిఆర్ అసెంబ్లీకి వస్తారా..రారా?

- ప్రస్తుతం రాజకీయా వర్గాల్లో ఇదే చర్చ
- బిఆర్ఎస్ ఎల్పీ భేటీకి ఐదుగరు ఎమ్మెల్యేల డుమ్మా
- మరో ఎమ్మెల్సీ చల్లా కూడా గైర్హాజరు



హైదరాబాద్ 23, జూలై (చైతన్యగళం) ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా..? లేదా..? అన్నది హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ సారి అసెంబ్లీకి వస్తారని జోరుగా ప్రచారం జరిగింది. మంగళవారం సమావేశాలు ప్రారంభమయ్యాయి. బీఏసీ సమావేశానికి -మిగతా 2 లో



## కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం.

- అన్ని రంగాల్లో తెలంగాణకు మొండి చెయ్యి
- తెలంగాణను బిజెపి పూర్తిగా నిర్లక్ష్యం చేసింది
- కేంద్ర బడ్జెట్ కేటాయింపులు పై? పిసిసి అధికార ప్రతినిధి బాలాజీ.

హైదరాబాద్ 23, జూలై (చైతన్యగళం)

లోక్ సభలో మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2024 25 లో హార్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలంగాణను పూర్తిగా విస్మరించారని తెలంగాణ పిసిసి అధికార ప్రతినిధి ఠాకూర్ బాలాజీ సింగ్ తీవ్రంగా ఖండించారు బడ్జెట్ రాజకీయ ప్రేరేపితమైందని ప్రజల కోసం కాదని బిజెపి తన మిత్రపక్షాల కోసం వారిని ప్రసన్నం చేసుకునేందుకే బడ్జెట్ రూపొందించింది అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత -మిగతా 2 లో

## త్వరలోనే సెమీ డే రెసిడెన్షియల్స్

డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

2 లో

# బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష

- తెలంగాణ పదం లేకుండానే బడ్జెట్
- పలుమార్లు ప్రధానికి కలిసి కోరినా గుండుసున్నా
- తెలంగాణపై ఉన్న కక్షను బయట పెట్టుకున్న మోడీ
- పోలవరం కోసం నిధులు ఇచ్చి...పాలమూరుకు ఇవ్వరా
- విభజన చట్టంలో తెలంగాణకు ఎందుకీ అన్యాయం
- తెలంగాణకు అన్యాయంపై అసెంబ్లీలో తీర్మానం
- పార్లమెంటులో ఎంపిలు నిరసన తెలియచేస్తాం
- కిషన్ రెడ్డి రాజీనామా చేసి నిజాయితీ నిరూపించుకోవాలి
- బడ్జెట్ కేటాయింపులపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు






హైదరాబాద్ 23, జూలై (చైతన్యగళం కేంద్రం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ 2047 బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష తో పాటు కక్షను కూడా ప్రదర్శించారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూఇంతగా దగా జరగలేదన్నారు. తాము పలుమార్లు ప్రధానిని, కేంద్రమంత్రులను కలసి -మిగతా 2 లో

## కదిరే కృష్ణ పై కఠిన చర్యలు తీసుకోవాలి



- చికోటి ప్రవీణ్
- కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిపై అతని వ్యాఖ్యలు అనుచితం
- హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా కృష్ణ వ్యాఖ్యలు
- అతని పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి
- న్యాయవాద వృత్తికి అతను అనర్హుడు, బార్ కౌన్సిల్ నుండి అతడిని బహిష్కరించాలని
- ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు పిలుపునిస్తాం
- హిందూ ధర్మ రక్షకుల ఆగ్రహానికి గురికాక తప్పదు
- కదిరే కృష్ణ పై భారతీయ జనతా పార్టీ నాయకుడు చికోటి ప్రవీణ్ ఆగ్రహం

హైదరాబాద్ 23, జూలై (చైతన్యగళం)

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రముఖ న్యాయవాది కదిరే కృష్ణ పై భారతీయ జనతా పార్టీ నాయకులు చికోటి ప్రవీణ్ కుమార్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన న్యాయవాద వృత్తిలో ఉంటూ సోషల్ మీడియా వేదికగా హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వెంకటేశ్వర స్వామి పై వ్యాఖ్యలు చేశారు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం విద్వేషాలు రెచ్చగొట్టే కదిరే కృష్ణ న్యాయవాద వృత్తికి అనర్హుడు అని ఆయనపై తక్షణమే బార్ -మిగతా 2 లో

## ఎపికి బడ్జెట్‌లో వరాల జల్లు

- అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు
- పోలవరం పూర్తికి బడ్జెట్‌లో హామీ



23, జూలై (చైతన్యగళం)-న్యూఢిల్లీ,

కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీకి వరాల జల్లు కురిపించారు. రాష్ట్రానికి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రాజధాని అమరావతికి భారీ ఆర్థిక సాయం ప్రకటించారు. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. అలాగే, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి పూర్తిగా సాయం చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, రైతులకు పోలవరం జీవనాడి అని.. భారత ఆహార భద్రతకు పోలవరం ఎంతో కీలకమైనదని చెప్పారు. అలాగే, హైదరాబాద్ - బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కూడా ప్రత్యేక -మిగతా 2 లో

# 48.21 లక్షల కోట్లు

(మొదటి తరువాయి)

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతూ.. ఈ అంశాలను ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్ సభలో ప్రవేశ పెట్టారు. తొమ్మిది సూత్రాల ఆధారంగా బడ్జెట్‌రూపకల్పన చేసినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన, ఆవిష్కరణలు, తయారీ,సేవలు, తర్వాతతరం సంస్కరణలు.. ఈ తొమ్మిది సూత్రాల ప్రాధాన్యంగా తీసుకుని బడ్జెట్ రూపొందించినట్లు తన ప్రసంగంలో విత్త మంత్రి ప్రకటించారు. ఇక ఈ బడ్జెట్ మొత్తంలో వివిధ రంగాలన్నింటికి కలిపి రూ.48.21 లక్షల కోట్ల కేటాయింపులు చేశారు. అంటే స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు. ఇందులో మొత్తం ఆదాయాన్ని రూ.32.07 లక్షల కోట్లుగా, దానిలో పన్ను ఆదాయాన్ని రూ.28.83 లక్షల కోట్లుగా చూపించారు. ఈ ఏడాది ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా వేశారు. అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా అంచనా కట్టారు. అదేవిధంగా నూతన పింఛన్ విధానంలో త్వరలో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. బడ్జెట్‌లో రైతులు,యువతపై ఎక్కువ దృష్టి పెట్టారు. యూత్ కు 2 లక్షల కోట్లు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. మొబైల్స్, బంగారంపై కస్టమ్స్ డ్యూటీని తగ్గించారు. ఆదాయపు పన్ను శ్లాబులను సవరించారు. అయితే
ఉద్యోగస్థులకు పెద్దగా ఉరట కల్పించలేక పోయారు. టాప్ 500 కంపెనీలలో కోటి మంది యువతకు 12 నెలల ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించేనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్న్ షిప్ భత్యంగా నెలకు రూ.5000, వన్ టైమ్ అసిస్టెన్స్ కింద రూ. 6000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక కంపెనీలు ఇంటర్న్ షిప్ వ్యయంలో 12 శాతం భరించాల్సి ఉంటుంది. బీహార్, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తామని నిర్మలా సీతారామన్ అన్నారు. బీహార్ లో విమానాశ్రయాలు, మెడికల్ కాలేజ్ లు, క్రీడల మౌలిక వసతులు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆందప్రదేశ్ రాష్ట్రాలను అభివృద్ధి పరుస్తామన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 15000 కోట్లను కేటాయించారు. మొబైల్ ఫోన్లపై, యాక్ససెరీలపై, ఛార్జర్స్ పై 15 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. ఉన్నత విద్య, దేశీయ సంస్థలకు రూ. 10 లక్ష ల కోట్లు కేటాయించారు. ఇకపోతే స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) లోటు 4.9 శాతం ఉండగలదన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 4.5 శాతం ఆర్థిక లోటుకే చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. వచ్చే రెండేళ్లలో కోటిమంది రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. కూరగాయల ఉత్పత్తి పెద్దఎత్తున చేపట్టేలా క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీగా కేటాయింపులు చేశారు. ముఖ్యంగా సేంద్రీయ వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులు సేంద్రీయ వ్యవసాయంలోకి ప్రవేశించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయంలో స్థిరమైన పద్ధతులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి పెంపుదలపై దృష్టి సారించామని.. ఆ దిశగా కార్యక్రమాలు చేపడతున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ తెలిపారు.అంతేకాదు.. వాతావరణ పరిస్థితులను తట్టుకునే, అధిక దిగుబడినిచ్చే ఉద్యానవన పంటలకు సంబంధించి 109 కొత్త వంగడాలను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యసాయ రంగానికి కేటాయించిన రూ. రాష్ట్రాల భాగస్వామ్యంతో ప్రభుత్వం వ్యవసాయానికి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌ను ప్రోత్సహిస్తుందని ప్రకటించారు. ఇక గ్రామీణాభివృద్ధి కోసం రూ. 2.66 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వ్యవసాయ ఉత్పాదతకు పెంపొందించడానికి, వాతావరణాన్ని తట్టుకోగల రకాలను అభివృద్ధి చేయడానికి వ్యవసాయ పరిశోధన శాలను ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేస్తుందన్నారు. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బ్జడెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. నూనెగింజల ఉత్పత్తి కోసం ఒక వ్యూహాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రైతుల ఆదాయం పెంచడం, వ్యవసాయ విలువను పెంచడం దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మద్దతుతో పంట అనంతర కార్యకలాపాలలో పెట్టుబడులను ప్రోత్సహించడం, పాడి రైతులకు సాధికారత, నానో-డిఎపిని అన్ని వ్యవసాయ-వాతావరణ మండలాలకు విస్తరించడం, 5 ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కుల ఏర్పాటు, ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించడానికి బ్లూ ఎకానమీ 2.0 ప్రారంభం, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన అమలును వేగవంతం చేయడం, 11.8 కోట్ల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు కేంద్ర ఆర్థిక మంత్రి. చిన్న రైతును దృష్టిలో ఉంచుకుని ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టారు. చిరు ధాన్యాలను పండించడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడంపైనా ఫోకస్ పెట్టింది.భారతదేశ వ్యవసాయ రంగం వారసత్వ సమస్యలలో కొట్టుమిట్టాడు తూనే ఉంది. ఇప్పటికీ దేశ జనాభాలో అధిక శాతం మంది ప్రజలు
దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు.

# కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం.

(మొదటి తరువాయి)

ఇది 11వ బడ్జెట్ కానీ కొత్త రాష్ట్రం కేంద్ర నిర్లక్ష్యానికి గురైంది 2014 తర్వాత మొదటిసారిగా బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం పేరుతో ప్రత్యేక అధ్యాయాన్ని పొందుపరిచారు కానీ ఆర్థిక మంత్రి 58 పేజీలు 14,692 పదాలున్న తన మొత్తం ప్రసంగంలో తెలంగాణ పదాన్ని ప్రస్తావించలేదని ఆయన అన్నారు. ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం గురించి మాట్లాడినప్పుడు తెలంగాణ ప్రస్తావనను పూర్తిగా దాటివేయడాన్ని బాలాజీ సింగ్ ఖండించారు. ఆంధ్రప్రదేశ్ కు నిధులు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకం కాదని,తెలంగాణ పట్ల చూపుతున్న వివక్షను మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ మంత్రులు బృందంగా గత ఏడు నెలలుగా అన్ని మంత్రిత్వ శాఖలకు నిధులు ఇవ్వాలని కోరుతూ పలు దరఖాస్తులు సమర్పించారని గుర్తు చేశారు.పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇస్తామని హామీ ఇచ్చిన బిజెపి ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ఎలాంటి హామీ ఇవ్వలేదని బాలాజీ సింగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.
కేంద్రం తెలంగాణకు ఇచ్చిన హామీలు కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ,బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ,గిరిజన యూనివర్సిటీకి నిధులు ,హై స్పీడ్ రైలు కనెక్టివిటీ ఇతరత్రా హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాల ప్రస్తావన తీసుకు రాలేదని బాలాజీ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను నెరవేరుస్తామని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ లతో చేసిన హామీలు నెరవేర్చబడతాయని భావిస్తున్నామని ఆయన అన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ సహా 8 మంది బీజేపీ ఎంపీలు కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తగిన వాటాను పొందడంలో విఫలమయ్యారని ఆయన అన్నారు తెలంగాణ రాష్ట్రానికి సంక్షేమ పథకాల్లో వాటా దక్కకుండా చేసిన కేంద్ర బడ్జెట్ తెలంగాణకు తీవ్ర నిరాశ కలిగించిందని ఆయన అన్నారు ఆఖరికి మూసి రివర్ డెవలప్మెంట్, రీజనల్ రింగ్ రోడ్డు కోసం సైతం నిధులు కేటాయించకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. మోడీ ప్రభుత్వం నిలిపివేసిన ఐటిఐఆర్ కారిడార్ని సైతం పునరుద్ధరించాలని బాలాజీ సింగ్ డిమాండ్ చేశారు.

# బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష

(మొదటి తరువాయి)

విన్నివించినా..ప్రధాని మోడీ పెద్దన్నగా అండగా ఉండాలని కోరినా తీవ్ర నిర్లక్ష్యం చూపారని మండిపడ్డారు. దీనిపై రేపటి శాసనసభలో కేంద్రానికి వ్యతిరేకంగా తీర్మానం చేస్తామని అన్నారు. అలాగే తమ నిరసనలు కొనసాగిస్తా మని అన్నారు. 8 సీట్లు ఇచ్చిన తెలంగాణ ప్రజల పట్ల మోడీ కక్ష సాధింపు చర్యలకు దిగారని, ఇందుకు నిరసనగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మంత్రులు పొన్నం పరభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులతో కలసి కేంద్ర బడ్జెట్‌పై ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణ అనే పదాన్నే నిషేధించారని మండిపడ్డారు. 'మా ప్రభుత్వంలోని మంత్రులు 18 సార్లు దిల్లీకి వెళ్లారు. తెలంగాణకు అవసరమైన నిధులు ఇవ్వాలని స్వయంగా నేను ప్రధానికి విజ్ఞప్తి చేశా. కానీ, తెలంగాణ పదం పలకడానికి కేంద్రం ఇష్టపడటం లేదు. మొదటి నుంచి ప్రధాని మోదీ తెలంగాణ పట్ల కక్ష కట్టారు. ఇప్పటి వరకు ఆర్‌ఆర్‌ఆర్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఏ రంగానికీ సహకారం అందించలేదు. వికసిత్ భారత్‌లో తెలంగాణ భాగం కాదని ప్రధాని అనుకుంటున్నారు. బడ్జెట్‌లో బిహార్, ఏపీని మాత్రమే పట్టించుకున్నారు. ఇతర రాష్ట్రాలను పట్టించుకోలేదు. 8 సీట్లు ఇచ్చి తెలంగాణ ప్రజలు భాజపా పట్ల వివక్ష చూపలేదు. 8 సీట్లు ఇవ్వడం వల్లే మోదీ ప్రధాని కుర్చీలో ఉన్నారు. తెలంగాణకు ఐఐఎం ఇవ్వలేమని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లేఖ రాశారు. అలాంటప్పుడు కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఎందుకు కొనసాగుతున్నారు? కేంద్రమంత్రి పదవి కోసం కిషన్‌రెడ్డి.. తెలంగాణ హక్కులను మోదీ వద్ద తాకట్టుపెట్టి ప్రజలను మోసం చేస్తున్నారు. పోలవరానికి నిధులిచ్చిన కేంద్రం.. పాలమూరు-రంగారెడ్డికి ఎందుకు నిధులు ఇవ్వట్లేదు?తెలంగాణపై కేంద్రం చూపించే వివక్ష మంచిది కాదు'అని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపిందని మండిపడ్డారు. తెలంగాణపై కేంద్రం కక్ష సాధించినట్లుందని.. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ' ప్రధాని తెలంగాణకు వస్తే స్వాగతం పలికి పెద్దన్న పాత్ర పోషించమని అడిగాను. పెద్దన్నలా ఉండాల్సిన ప్రధానికి ఇది సరికాదు. ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని నిధులు అడిగాం. ప్రధాని మోదీని నేనే మూడుసార్లు కలిసి అడిగాను. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను మెరుగుపరుద్దామని ప్రధానితో చెప్పాను. అయినా తెలంగాణకు అన్యాయం జరిగింది. మా మంత్రులు కూడా కేంద్ర మంత్రులను కలిశారు. 18 సార్లు ఢిల్లీ వెళ్లి నిధులు ఇవ్వాలని కోరాం.. తెలంగాణ ఏర్పాటు పట్ల మోదీకి ఉన్న కక్షను మరోసారి చాటారు' అని రేవంత్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏపీకి ఎన్నిరకాలుగా కేటాయింపులు చేయాలో అన్ని రకాలుగా కేటాయించారు. ఏపీకి ఎందుకు నిధులు ఇస్తున్నారు..? అని మేం అడగడం లేదు. పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్టు ఏపీకి నిధులు కేటాయించారు. తెలంగాణ విషయంలో ఇంత కక్ష ఎందుకు?. గుజరాత్‌కు ఎలా నిధులు కేటాయించారో,మూసీకి అలా నిధులు కేటాయించామని ప్రధాని మోదీని అడిగాను. హైదరాబాద్‌కు నిధులు ఇస్తే దేశ ఎకానమికి ఉపయోగపడుతుందని మోదీకి వివరించాను. పదేండ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఐటీఐఆర్ కారిడార్ మరుగున పడింది. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ స్లోగన్ బోగస్ అని బీజేపీ నిరూపించింది. వికసిత్ భారత్‌లో మా రాష్ట్రం ఉండదా?' అని కేంద్రంపై రేవంత్ ప్రశ్నల వర్షం కురిపించారు. 'కేంద్ర బడ్జెట్ కుర్చీ బచావో బడ్జెట్‌లాగా ఉంది. ఇంత కక్షపూరిత బడ్జెట్ గతంలో ఎప్పుడూ లేదు. తెలంగాణ ఓట్లు, సీట్లు మాత్రమే బీజేపీకి కావాలని ఎన్నికల ముందే చెప్పాను.

# నీట్ పరీక్ష పేపర్ లీక్ నిజమే

(మొదటి తరువాయి)

వెలువరించింది. నీట్ మళ్లీ నిర్వహించాలన్న డిమాండ్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది.ఝార్ఖండ్‌లోని హజారీబాగ్, బిహార్‌లోని పట్నాలోని కేంద్రాల్లో నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకైందన్న మాట వాస్తవం. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం దాదాపు 155 మంది విద్యార్థులు లీక్ వల్ల లబ్దిపొందినట్లు తెలుస్తోంది. ఈ విద్యార్థులపై చర్యలు తీసుకోవాలి. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని చెప్పేందుకు సరైన ఆధారాలు లేవు. వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైందని నిర్ధారణకు రావడం ప్రస్తుత దశలో కష్టం. మళ్లీ పరీక్ష పెడితే 24 లక్షల మంది ఇబ్బంది పడతారు. వారిలో అనేకమంది వందల కి.మీల దూరం ప్రయాణం చేసి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి.

# కెసిఆర్ అసెంబ్లీకి వస్తారా..రారా?

(మొదటి తరువాయి)

ఆయనే హాజరవుతారని అంతా భావించారు. అయితే బీఆర్‌ఎస్ తరపున మాజీ మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. సమావేశాల ఎజెండాపై చర్చించారు. అయితే కేసీఆర్ మాత్రం మధ్యాహ్నం తర్వాత తెలంగాణ భవన్ లో జరిగిన బీఆర్‌ఎస్ ఎల్పీ సమావేశానికి హాజరై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. కొందరు పార్టీ నేతలు మాత్రం బడ్జెట్ రోజు అసెంబ్లీకి వస్తారని చెబుతున్నారు. అయితే హరీశ్ రావు మీడియాతో చేసిన చిట్ చాట్ లో కేసీఆర్ అసెంబ్లీకి వస్తారో లేదో..? చెప్పం.. అది మా స్ట్రాటజీ అంటూ దాటవేశారు. మధ్యాహ్నం తర్వాత తెలంగాణ భవన్ లో ఎల్పీ మీటింగ్ నిర్వహించిన కేసీఆర్ తొమ్మిది అంశాలపై సభలో చర్చించాలని సూచించారు. అయితే ఈ సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అనారోగ్యం కారణంగా గైర్హాజరయ్యారు. ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న ఆలస్యంగా సమావేశానికి వచ్చారు. స్వయంగా పార్టీ చీఫ్ కేసీఆర్ హాజరైన సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు డుమ్మా కొట్టడం బీఆర్‌ఎస్ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే, ఎల్పీ సమావేశానికి గైర్హాజరైన వారిలో కొందరు పార్టీ మారబోతున్నట్లు గత కొంత కాలంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ అధ్యక్షన జరిగిన బీఆర్ ఎస్ ఎల్పీ సమావేశానికి ఎమ్మెల్యేలు మాణిక్యరావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ గౌడ్ తోపాటు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి డుమ్మాకొట్టారు. సమావేశానికి హాజరుకాని వారు పార్టీ మారుతున్నారా ఏంటీ అనే సందేహాలు, చర్చ మొదలైంది.

# ఎపికి బడ్జెట్‌లో వరాల జల్లు

(మొదటి తరువాయి)

నిధులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. ఏపీ విభజన చట్టానికి కట్టుబడి ఉన్నాం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సాయం చేస్తాం. విభజన చట్టంలో పొందుపరిచినట్లుగా వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక సాయం అందించడం సహా రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం.' అని విత్త మంత్రి పేర్కొన్నారు.

# త్వరలోనే సెమీ డే రెసిడెన్షియల్స్

## -డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, ఎడ్యుకేషన్ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డే స్కూల్ కాకుండా సెమీ అండ్ రెసిడెన్షియల్ పాఠశాలలు త్వరలోనే ప్రారంభం కాబోతున్నాయని ప్రకటించారు. ఇప్పుడున్న ప్రభుత్వ విద్యకంటే నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని వివరించారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ... ఒక్కో పాఠశాల కోసం రూ.80 నుంచి రూ. 100 కోట్లు ఖర్చు చేయబోతున్నామని అన్నారు. ఒక్రేజ్, బిర్లా ఓపెన్ స్కూల్స్ టైప్ ప్రభుత్వ పాఠశాలలు రాబోతున్నాయని చెప్పారు. ప్రతీ మండలానికి రెండు లేదా మూడు పాఠశాలలు తొలుత రాబోతున్నాయని అన్నారు. రుణమాఫీపై ప్రతిపక్షాలు హైదరాబాద్‌లో కూర్చొని మాట్లాడొద్దని హితవు పలికారు.

# కదిరే కృష్ణ పై కఠిన చర్యలు తీసుకోవాలి

(మొదటి తరువాయి)

కౌన్సిల్ నిషేధం విధించాలని చికోటి ప్రవీణ్ డిమాండ్ చేశారు.కృష్ణ తన వైఖరి మార్చుకోకపోతే హిందూ ధర్మ రక్షకుల ఆగ్రహానికి గురికాక తప్పదు అని ప్రవీణ్ హెచ్చరించారు.హిందూ దేవుళ్ళ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది అని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి దేవుళ్ళను కించపరిచి, హిందువుల మనోభావాలను దెబ్బతీసే వాళ్ళను అత్యంత కఠినంగా శిక్షించే విధంగా చట్టం చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే కదిరే కృష్ణ పై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని చికోటి ప్రవీణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మోరిశెట్టి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టిపనీకైనా ఇంటోడే ఉండాలి

**-పార్లమెంటులో తెలంగాణ వాదుల ప్రాతినిధ్యం అవశ్యం**
**-మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి జులై 23 (చైతన్య గళం):** పార్లమెంటులో తెలంగాణ వాదుల ప్రాతినిధ్యం ఉండడం ఆవశ్యమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పార్లమెంటులో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఉండడం వల్ల తెలంగాణకు ఏం న్యాయం జరిగిందని అన్నారు. 400 సీట్లు గెలుస్తామన్న బీజేపీ చివరకు ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారం దక్కించుకుందని ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారం దక్కుతుందనుకున్న కాంగ్రెస్ అందనంత దూరంలో ఆగిపోయిందని అన్నారు. అధికారం నిలబెట్టుకోవడానికి బీజేపీ ఆంధ్ర, బీహార్ రాష్ట్రాలకు బడ్జెట్లో వరాలు కురిపించిందని అన్నారు. ఆంధ్రాకు నిధులు దక్కడం ఆహ్వానించదగ్గ పరిణామమే. సంతోషకరమే మరి తెలంగాణలో 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచి ఏం లాభం ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ అస్తిత్వం ఉన్న బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని ప్రజలను కోరింది ప్రాంతీయ పార్టీలతో ఏం పని అని జాతీయపార్టీలు ఎన్నికల్లో చెబుతున్నాయి అవే ప్రాంతీయ పార్టీలను బతిమాలి పొత్తు పెట్టుకుని జాతీయ పార్టీలు అధికారంలోకి ఎందుకు వస్తున్నాయని దుయ్యబట్టారు.ప్రాంతీయ పార్టీలకు జాతీయ ఎన్నికల్లో ఏం పని అంటున్న కాంగ్రెస్, బీజేపీలకు గ్రామస్థాయి సర్పంచ్, ఎంపీపీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయడం ఎందుకు అని ప్రశ్నించారు. అందుకే జాతీయ పార్టీల వాదన పిచ్చి వాదన.ఆయా రాష్ట్రాల అవసరాలు ప్రత్యేకంగా ఉంటాయి. అక్కడి అవసరాలు ఏంటి అని ఆయా రాష్ట్రాల ఎంపీలు కొట్లాడి నిధులు తీసుకువస్తారు అని అంటున్నాం లేదా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో మిత్రపక్షంలో ఉన్న వారు తీసుకువస్తారు. అందుకే తెలంగాణ ఎంపీలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం ఉండాలని మొత్తుకున్నాం. జాతీయ పార్టీలతో ఎన్నడూ రాష్ట్రాలకు ప్రయోజనం ఉండదు. ప్రాంతీయ పార్టీలే శ్రీరామరక్ష.బడ్జెట్లో తెలంగాణను విస్మరించడం కాంగ్రెస్, బీజేపీ పార్టీ ఎంపీల వైఫల్యానికి నిదర్శం కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు నిధులు కేటాయించక పోవడంపై ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అవకాడో పండ్లతోటను పరిశీలించిన మాజీ మంత్రి



**కందుకూరు జులై 23 (చైతన్య గళం):** రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం దేబ్బాడగూడ గ్రామములో రామావత్ జైపాల్ నాయక్ లండన్ నగరంలో M.B.A పూర్తి చేసి వ్యవసాయంపై మక్కువతో స్వగ్రామం చేరుకొని తన వ్యవసాయ క్షేత్రంలో అవకాడో పండ్లను పండిస్తున్నారు. అవకాడో పండ్లతో పాటు వివిధ రకాల పండ్లతోటలు,కూరగాయలు ఆధునిక పద్ధతులలో అధిక దిగుబడి సాధిస్తున్నారు.వారి ఆహ్వానం మేరకు ఆ పండ్లతోటలను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సందర్శించిసాగువిదానాన్ని అడిగి తెలుసుకున్నారు. అవకాడో పండ్లలో విటమిన్-సి, మెగ్నీషియం, ప్రోటీన్ వంటి పోషక విలువలు కలిగి తెలిపారు. అధిక దిగుబడి, లాభాలను ఇచ్చే ఈ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని నిరంజన్ రెడ్డి కోరారు.

## భౌరంపేట్ లోని రోడ్డు పనులను పరిశీలించిన కమిషనర్, మున్సిపల్ కౌన్సిలర్లు



**కుత్బుల్లాపూర్ జూలై 23 (చైతన్య గళం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ లో మిషన్ భగీరథ నూతన పైప్ లైన్ను గత కొన్ని రోజులుగా నిర్మిస్తున్నారు దాని వల్ల రోడ్డు పూర్తిగా పాడవడం జరిగింది. గ్రామంలో ప్రతి రోజు నిత్యం కొన్ని వందల స్కూల్ బస్సులు తిరగడం ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందికి గురికావడం జరుగుతుంది ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ కౌన్సిలర్లు మరియు స్థానిక నాయకులు, కమిషనర్, AE, HMWSSB అధికారులతో కలిసి గ్రామంలోని రోడ్లను పరిశీలించి వెంటనే నూతన రోడ్డును వేసేలా ప్రతిపాదించారు. భౌరంపేట్ లోని మల్లన్న గుడి వద్ద నుండి DPS స్కూల్ వరకు నూతన రోడ్డును నిర్మిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, యస్.వి.సురేందర్ రెడ్డి, మురళీ యాదవ్, పీసరి క్రిష్ణ రెడ్డి, సరుగారి జీవన్ రెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, హెచ్.ఏం.డబ్లు.ఎస్ మేనేజర్ సౌమ్య, ఏఈ ప్రవీణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెకండ్ ఏఎన్ఎం ల సమస్యలను పరిష్కరించాలి

**-ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీహరి**
**-ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ**



**వనపర్తి జులై 23 (చైతన్య గళం):** సెకండ్ ఏఎన్ఎం ల జిల్లా కమిటీ సమావేశం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శివ లీల అధ్యక్షత న మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటిసి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీహరి జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ లు మాట్లాడుతూ సెకండ్ ఏఎన్ఎం ల సమస్యలు పరిష్కరించాలని. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని. ఏఎన్ఎం లకు ఇచ్చే వేతనాలనే సెకండ్ ఏఎన్ఎం లకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వ హాయంలో సమ్మె చేయడం జరిగిందని ఆ సమ్మే డిమాండ్ లను ఈ ప్రభుత్వమైన పరిష్కారం చేయాలని. సెకండ్ ఏఎన్ఎం లను రెగ్యులరైజ్ చేయాలని. ఏఎన్ఎంల పోస్టులు భర్తీ చేయాలని ఆ పోస్టుల భర్తీలో సెకండ్ ఏఎన్ఎంలకు వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక సమస్యలతో సెకండ్ ఏఎన్ఎం లు ఇబ్బంది పడుతున్నారని వైద్య రంగంలో సెకండ్ ఇయర్ లో పాత్రను గుర్తించి వారి సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.లేనియెడల ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి రమేష్. సెకండ్ ఏఎన్ఎం ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి,లక్ష్మమ్మ, నాగలక్ష్మి, కొండమ్మ, సబిత గ్రేస్,సుమిత్ర,చంద్రమ్మ, ఉమా మహేశ్వరి,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణపై కక్షపూరిత వైఖరి చూపిన కేంద్రం

**-బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే ప్రాధాన్యత**
**ఎమ్మెల్యే మేఘా రెడ్డి**



**వనపర్తి జులై 23 (చైతన్య గళం):** బడ్జెట్ కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత వైఖరి ప్రదర్శించిందని... కేవలం బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే ప్రాధాన్యత ఇచ్చిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ఏపీలోని పోలవరం కు నిధులు కేటాయించినప్పుడు తెలంగాణలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంలో ఎందుకు వివక్ష చూపించారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ పై నరేంద్ర మోది చూపించే కక్షపూరిత వైఖరిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఖండిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం తయారుచేసిన బడ్జెట్ కేవలం కుర్చీ కాపాడుకునేందుకే తయారుచేసినట్లు ఉందని...నిరుపేద ప్రజలకు రాష్ట్రాలకు ఉపయోగపడేలా లేదని ఆయన విమర్శించారు.బడ్జెట్ పై కేంద్రంలో నిరసన తెలిపేందుకు తెలంగాణ బిజెపి ఎంపీలు కాంగ్రెస్ ఎంపీలతో పాటు కలిసి రావాలని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ బీజెపి ప్రజా ప్రతినిధులు మంత్రి పదవుల కోసం తెలంగాణ ఆత్మగౌరవాన్ని మోది వద్ద తాకట్టు పెట్టకూడదని ఆయన విమర్శించారు.ఇలాంటి కక్షపూరిత ధోరణి ఇలాగే కొనసాగితే బిజెపి కి తెలంగాణ రాష్ట్రంలో మనుగడ లేకుండా పోతుందని ఆయన అన్నారు.

## రైతు భీమా దరఖాస్తు చేసుకోవాలి

**-ఇమ్రాన్ బాబా**



**కడ్తాల్ జూలై 23 (చైతన్య గళం):** అర్హులైన రైతులందరూ రైతు భీమా కోసం నమోదు చేయించుకోవాలి అని కల్వకుర్తి యువజన కాంగ్రెస్ నాయకులు మొహ్మద్ ఇమ్రాన్ బాబా ఒక ప్రకటనలో రైతులను కోరారు. అర్హులైన రైతులు ఆగస్ట్ 5 లోపు వారి యొక్క పట్టాదార్ పాస్ పుస్తకం,ఆధార్ కార్డు,నామిని పేరు,నామిని ఆధార్ కార్డు ను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి గ్రామంలోని రైతు వేదికలో అందజేసి రైతు బీమా నమోదు చేయించుకోవాలి ఆయన తెలిపారు.

## వెదిరె చల్మా రెడ్డి ప్రధమ వర్ధంతి వాల్ పోస్టర్ ఆవిష్కరించిన కోదండరాం



**ఇబ్రహీంపట్నం జూలై 23 (చైతన్య గళం):** ఇబ్రహీంపట్నం తెలంగాణ ఉద్యమకారులు రంగారెడ్డి జిల్లా తూర్పు డివిజన్ చైర్మన్ వెదిరే చల్మారెడ్డి ప్రధమ వర్ధంతి ఈనెల 28వ తేదీ ఉదయం11గంటలకు తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం భారత్ కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నారు . అట్టి వాల్ పోస్టర్ ను తెలంగాణ ఉద్యమం నేత ప్రొఫెసర్ కోదండరాం హైదరాబాద్ లో తన తన నివాసంలో తెలంగాణ ఉద్యమకారులు రంగారెడ్డి జిల్లా టీ.జే.ఏ.సి నాయకులతో కలసి వాల్ పోస్టర్ ను కోదండరాం సార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో రంగారెడ్డి జిల్లా కో కన్వీనర్లు MD గౌస్, ప్రొద్దుటూరి. రవిందర్ గుప్త, తెలంగాణ జన సమితి ఇబ్రహీంపట్నం ఇంచార్జి సామ నిరంజన్, తాటిపర్తి మాజీ సర్పంచ్ దూస రమేష్, మంచాల మండల టీ.జే.ఏ.సి అధ్యక్షులు జంగయ్య,యాచారం మండల నాయకులు ముజిబ్ తదితరులు పాల్గొన్నారు

## పరిశుభ్రత, క్యాన్సర్ పై అవగాహన సదస్సు



**కుత్బుల్లాపూర్ జూలై23(చైతన్య గళం):** భాగ్యరధి డిగ్రీ కళాశాల లో సామాజిక సేవకురాలు డా. శాలిని విద్యార్థులతో సామాజిక అవగాహన పరిశుభ్రత ఇంకా క్యాన్సర్ లాంటి వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ శాలిని మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని , అపరిచిత వ్యక్తులతో మాట్లాడటం కానీ,రాత్రివేళలో ప్రయాణించవలసి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, సామాజిక మాధ్యమాలలో అపరిచిత వ్యక్తులతో సంభాషించడం కానీ, అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు ఏ విధంగా స్పందించాలని ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు. ఆడపిల్లలకు చదువు యొక్క ఆవశ్యకతను తెలియజేశారు కుటుంబం పట్ల సమాజం పట్ల ఏ విధంగా బాధ్యతగా మెలగాలో, విద్యా ఉద్యోగ రంగాలలో ఏ విధంగా రాణించాలో, యుక్తవయస్సులో హార్మోన్ల ప్రభావం మానసిక పరిస్థితి ఇతర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమం లో క్రియాశీల సభ్యుడు మోహనరావు మిర్తిపాటి, కాలేజీ ప్రిన్సిపాల్ చల్ల గోవింద రెడ్డి, కాలేజీ డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**యాచారం జూలై 23 (చైతన్య గళం):** విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు అయ్యవారి గూడ 11KV ఫీడర్ విద్యుత్ మరమ్మతులు మరియు విద్యుత్ తీగలకు తగిలే చెట్టు కొమ్మలను తొలగించు కార్యక్రమం ఉండటం వలన ఈరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని యాచారం AE సందీప్ కుమార్ తెలిపారు . అయ్యవారి గూడ గ్రామం ఫీడర్ పరిధిలోని రైతులకు విద్యుత్ వినియోగదారులకు విద్యుత్తు నిలిపి వేయడం జరుగుతున్నది కాబట్టి విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ AE ఒక ప్రకటన లో తెలిపారు

## 150మంది విద్యార్థులకు ఉచితంగా బెల్టు మరియు టైల పంపిణీ



**యాచారం జులై 23 (చైతన్య గళం):**
ఇబ్రహీంపట్నం మంచాల మండలం లోయపల్లి (జడ్.పి.హెచ్.ఎస్) ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బీజేపీ నాయకులు కారింగు రాజు గౌడ్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థుల కు ఉచితంగా బెల్టు మరియు టై లను రాజు గౌడ్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యాబోధన ఉంటుంది అని ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని అన్నారు . గ్రామంలో ఉన్న యువకులు విద్యార్థుల కు సహకారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాద్యాయులు,ఉపాధ్యాయులు, లోయపల్లి బిజెపి గ్రామ కన్వీనర్ మోర శ్రీశైలం మరియు మాజీ కన్వీనర్ కర్నాటి సురేష్ బూత్ అధ్యక్షులు చెరుకు జంగయ్య మరియు కొప్పుల జనార్ధన్ దోసపాటి కిరణ్ తదితరులు ఉన్నారు.

## వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా మోడీ 3.0 మొదటి బడ్జెట్

### -నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్



**ఆమనగల్లు జూలై 23 (చైతన్య గళం):**
ఆమనగల్లు పేద-మధ్య తరగతి ప్రజలకు పెద్దపీట వేస్తూ మహిళ, రైతు, నిరుద్యోగ యువతకు అండగా,గ్రామీణాభివృద్ధికి మరింత ఉతం అందిస్తూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రవేశ పెట్టింది అని నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్ అన్నారు.ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించాలని పిఎం - అవాస్ యోజన పథకానికి భారీ ఎత్తున నిధులు కేటాయించినందుకు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు.కేంద్రంలో ఎన్డీయే నేతృత్వంలోని మోదీ ప్రభుత్వం వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టింది. దేశీయ ఉత్పత్తిని పెంపొందించడానికి, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వారికి పన్ను ఆదా ప్రకటించింది. వీధి వ్యాపారుల నుంచి మొదలు రైతులు, పారిశ్రామికవేత్తల వరకు అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉంది అని ఆయన అన్నారు.పరిశు భ్రత, క్యాన్సర్ పై అవగాహన సదస్సు

## గొర్ల పంపిణీ పై అసెంబ్లీలో చర్చించాలి

### -ఐనవోలు మండల కార్యదర్శి నల్లబెట్ట చిన్న రాజు



**ప్రతినిధి/వర్ధన్నపేట:జులై 23 (చైతన్య గళం)**
గొర్ల కాపరుల సమస్యలు,గొర్ల పంపిణీ పై అసెంబ్లీలో చర్చించి పంపిణీ ప్రారంభించాలని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం ఐనవోలు మండల కార్యదర్శి నల్లబెట్ట చిన్న రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న రాజు మాట్లాడుతూ 2017 జూన్ 20వ తేదీన గత ప్రభుత్వం గొల్లకురుమలకు గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో రెండో విడతలో 22 13 డిడిలు కట్టారు. 1134 మందికి పంపించేశారు. మిగతా 1079 మందికి పంపిణీ చేయలేదన్నారు.ఇప్పటి వరకు సుమారు 4లక్షల మంది గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ జరిగింది.ఇంకా 3,37,816 మందికి గొల్ల కురుమలకు గొర్రెలు రావాల్సి ఉంది. మొత్తం స్కీం మీద సమగ్ర విచారణ చేపట్టాలని ,బాధ్యులైన వారందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 వేల మంది ఒక్కొక్కరు 43,750 రూపాయల చొప్పున డి.డి.లు తీసి రెండేండ్లుగా గొర్రెల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ కూడా అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో లో 3 నెలల్లో అందరికీ గొర్రెలిస్తామని వాగ్దానం చేసింది. కానీ ఇప్పటికీ అతీగతీ లేదన్నారు.గతంలో వలె అవినీతి అక్రమాలకు తావులేకుండా యూనిట్ మొత్తం నగదు బదిలీ ద్వారా పథకాన్ని అమలు చేయాలన్నారు.డి.డి.లు వాపస్ తీసుకోమని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు వెంటనే వాపస్ ప్రక్రియ నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## పర్యావరణాన్ని పరిరక్షించండి

### -అనూస్ అకాడమీ హై స్కూల్ డైరెక్టర్ అరుణ వెంగల్ రెడ్డి



**వనపర్తి జులై 23 (చైతన్య గళం):**
పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని అనూస్ అకాడమీ హై స్కూల్ డైరెక్టర్ అరుణ వెంగల్ రెడ్డి అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అరుణ వెంగల్ రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సందర్భంగా అరుణ వెంగల్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ,ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోని చెట్లను పెంచడం ద్వారా భావితరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందిగలమని అన్నారు.స్వచ్ఛమైన అహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయడం గురించి మొక్కలు నాటాలని,నాటిన ప్రతి మొక్కను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ఎక్కడైతే పచ్చదనం ఉంటుందో అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని ,ఫలితంగా అక్కడ ఉండే వారి యొక్క ఆలోచన విధానం కూడా మారుతుందని అన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నామినేషన్ వేసిన ఆవుల చంద్రశేఖర్



**వనపర్తి జులై 23 (చైతన్య గళం):**
వనపర్తి మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి చందాపూర్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ ల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆవుల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా, ప్రజా సమస్యల మీద అలుపెరగని పోరాటం చేస్తూ, గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో చందాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నుండి వార్డ్ మెంబర్ గా గెలిచి గ్రామానికి ఉపసర్పంచ్ గా ఎన్నికై జిల్లా ఉపసర్పంచ్ ల సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నుకోబడి గత ప్రభుత్వంలో బిఆర్ఎస్ నాయకులు అడగడుగునా సృష్టించిన సమస్యలను మనోధైర్యంతో ఎదుర్కొడ్డి, ఇబ్బందుల పాలైనా కూడా పట్టువిడవకుండా మూడు రంగుల కాంగ్రెస్ పార్టీ జెండాను ఎత్తుకున్న ఒక క్రమశిక్షణ గల కార్యకర్తగా మరియు పార్టీ బలోపేతం కొరకు రాజీ లేని పోరాటం చేశానని తెలిపారు. టీపీసీసీ చేపట్టిన నూతన మండలాల యూత్ అధ్యక్ష పదవిలో భాగంగా వనపర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఆన్లైన్ లో నామినేషన్ దాఖలు చేశానని అభిమానించే నాయకులు, కార్యకర్తలు తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వనపర్తి మండల యూత్ కాంగ్రెస్ సభ్యులకు ఆవుల చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.

# కెఎల్ఎం యూనివర్సిటీ యాజమాన్యం పై హత్యాయత్నం కేస్ నమోదు చేయాలి

### -సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



**కుత్బుల్లాపూర్ జోన్ 23( చైతన్య గళం):**
గత వారం గాజులరామరం డివిజన్ లాలసాహెబ్ గూడ కు చెందిన దారం పద్మావతి కుమారుడు దారం నర్సింగరావు పై కెఎల్ఎం యూనివర్సిటీ సిబ్బంది దాడి చేసి తీవ్ర గాయాలు పాలవడం జరిగింది. ఈ సందర్భంగా నిందితులు మా యాజమాన్యం మిమ్మల్ని చంపి పేగులు మెడలో వేసుకోమన్నది అన్నారని పోలీస్ స్టేషన్లో,వీడియో లో సాక్షాత్తూ దారం పద్మావతి చెప్పిందని కానీ పోలీస్ వారు కేవలం సిబ్బంది పై బెయిలబుల్ కేస్ వేసి యాజమాన్యం పై ఎలాంటి కేస్ నమోదు చేయకపోవడం దురదృష్టకరమని కావున యాజమాన్యం,సిబ్బంది పై హత్యాయత్నం కింద కేసు నమోదు చెయ్యాలని సురారం పోలీస్ ఇన్స్పెక్టర్ భరత్ కుమార్ కి సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది.కేవలం భూమికి సంబంధించి ఏస్సి,ఏస్టీ అట్రాసిటీ కేస్ నమోదు వల్ల నిందితులకు ఎలాంటి ఇబ్బంది లేదని కావున హత్యాయత్నం కింద కేస్ నమోదు చేస్తే భవిష్యత్తులో మరెవరూ ప్రజల పైన దాడి చేయరని,కేవలం చిన్న చిన్న కేసులు ఉండటం వల్ల కబ్జాదారులు భయపడటం లేదని,గత ప్రభుత్వంలో, ఈ ప్రభుత్వంలో కూడా పేద ప్రజల కు న్యాయం జరగట్లేదని ఇప్పటికైనా పోలీస్ అధికారులు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, సీపీఐ నాయకులు చంద్రమోహన్, బాలయ్య,సురేష్ తదితరులు పాల్గొన్నారు.


## తాళం వేసిన ఇంట్లో చోరీ...



**మిర్యాలగూడ ప్రతినిధి:జులై 23 (చైతన్య గళం)**
తాళం వేసివున్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డాడు.లక్ష రూపాయల నగదు,4 తులాల బంగారు ఆభరణాలు, 10తులాల వెండి అపహరించారు.ఈ ఘటన మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామంలో చోటుచేసుకుంది.మిర్యాలగూడ రూరల్ ఎస్సై నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామానికి చెందిన చేపూరి రవీంద్ర సోమవారం మధ్యాహ్నం తన కూతుర్ని హైదరాబాదులోని కాలేజీలో దింపడానికి వెళ్ళాడు. అతని భార్య చేపూరి అశ్విని, కుమారుడు మణికంఠ తమ ఇంటితోపాటు రైస్ మిల్లుకు తాళం వేసి మిర్యాలగూడలో ఉన్న వారి మణికంఠ ఫ్యామిలీ దాబాకు వెళ్లి తిరిగి రాత్రి గం.10-30 నిమిషాలకు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామానంత చిందరవందరగా బయటపడి వుంది.లాకర్లో పెట్టిన లక్ష రూపాయల నగదు,4 తులాల బంగారు ఆభరణాలు, 10తులాల వెండి కనిపించలేదు.చోరీ జరిగిందని భావించి మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

## తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శిగా డా.తాళ్ల జయంత్ గౌడ్

### -నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు బొనగాని యాదగిరి గౌడ్



**ప్రతినిధి/హన్మకొండ:జులై 23 (చైతన్య గళం)**
తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శిగా డా. తాళ్ల జయంత్ గౌడ్ ని నియమిస్తూ తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొనగాని యాదగిరి గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.డా.మంగళవారం తాళ్ల జయంత్ గౌడ్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి గౌడ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ లో ఉన్నటువంటి గౌడ కులస్తుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నటువంటి డా. తాళ్ల జయంత్ గౌడ్ ని గుర్తించి తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శిగా నియమించడం జరిగిందన్నారు.అనంతరం డా. తాళ్ల జయంత్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కుల అభివృద్ధికి,తెలంగాణ గౌడ సంఘం ఆశయాలకు, లక్ష్యాలకు, సంక్షేమం కోసం గౌడులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి కృషి చేస్తానని, నాపై నమ్మకం తో జిల్లా కార్యదర్శి గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు బొనగాని యాదగిరి గౌడ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర నాయకులు మార్క అనిల్ కుమార్ గౌడ్ , హనుమకొండ జిల్లా అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్, పచ్చిమట్ల శ్రీకాంత్ గౌడ్, బుర్ర శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.